క్లుప్తంగా

కారు- టిప్పర్ ఢీ



కారు, టిప్పర్ ఢీకొనడంతో రోడ్డుపై ఆగిన వాహనాలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కొండచుట్టు మండపం మలుపు వద్ద కారును టిప్పర్ ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. పుత్తూరు వైపుగా వెళుతున్న టిప్పర్ నగరి వైపు వస్తున్న కారును కొండచుట్టు మండపం మలుపు వద్ద ఢీకొంది. రెండు వాహనాలు అకస్మాత్తుగా వేగాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది. వాహనదారుల మధ్య వివాదం ఏర్పడడంతో వాహనాలు భారీగా రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సరిదిద్దారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

శ్రీరంగరాజపురం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తయ్యూరు పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న అన్నారు. గురువారం ఆమె తయ్యూరు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి విద్యార్థి తల్లిదండ్రులకు చదివి ఒక ఆవశ్యకతను తెలియజేసి బడి ఈడి పిల్లలు బడిలోనే ఉండాలని పనికి వెళ్లరాదని విద్యార్థుల తల్లిదండ్రులు సూచించారు. విద్యార్థులకు అవసరమైన వనరులను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తా ఉందన్నారు. పేదరికాన్ని జయించాలంటే విద్యతోనే సాధ్యం అన్నారు. అనంతరం పెద్దతయ్యూరు గ్రామంలో బడి ఈడు పిల్లలు ఏడుగురిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ఉమాదేవి, ఉషారాణి తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు రాకుండా చూడండి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

పాలసముద్రం: మండల పరిధిలో రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుబ్బులక్ష్మి తెలిపారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమించకుండా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని తెలిపారు. ప్రజలు, రైతులు నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు కులం, ఆదాయం, నివాస సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కార్యాలయం చుట్టూ తిరగకుండా వారికి సకాలంలో సర్టిఫికెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సప్తగిరి సంగీత సప్తాహం

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ప్రేక్షకులను అలరింపజేశాయి. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న నిర్విరామ సప్తగిరి సంగీత సప్తాహం గురువారంతో ఐదో రోజుకు చేరుకుంది. అపురూప వాగ్గేయకార వైభవం పేరుతో తొలుత శ్రీభద్రాచల రామదాస కీర్తనల గోష్టిగానం చేపట్టారు. అనంతరం విజయవాడకు చెందిన కేవీ.బ్రహ్మానందం బృందం, హైదరాబాద్‌కు చెందిన వారణాసి జ్యోత్స్న బృందం, హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.కృష్ణవేణి బృందం, విశాఖపట్నంకు చెందిన జి.శారదా సుబ్రమణియన్ బృందం చక్కటి గానంతో భక్తి సంకీర్తనలు గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందికిపైగా సంగీత కళా బృందాలు తమ దైన శైలిలో సుమధురంగా సంకీర్తనలను ఆలపించారు. అలాగే తిరుపతికి చెందిన కె.శ్రీదేవి శిష్యబృందం ప్రదర్శించిన ఉత్సవ సంప్రదాయ కీర్తనల నృత్యం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. భక్తి సంకీర్తనలను రమణీయంగా గానం చేసి మెప్పించిన సంగీత కళాకారులను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఆరో రోజు శుక్రవారం సప్తగిరి సంగీత సప్తాహంలో అన్నమాచార్య పద కవితా గుభాళింపు పేరుతో గాత్ర సంగీత కచేరీలు నిర్వహించనున్నారు.

ఆరోగ్య యోగం



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు



- యాంత్రిక జీవితానికి అద్భుత ఔషధి
- శారీరక, మానసిక రుగ్మతల నుంచి విముక్తి
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నగరి: ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ అనేక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ప్రశాంతంగా గడిపే క్షణాలు అరుదుగా మారాయి. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ఉరుకులు, పరుగుల జీవనమే. దీంతో అధిక ఒత్తిడికి గురవుతున్నారు. నిద్రలేమి, వేళకు తిండి తినకపోవడం, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, వ్యాయామం లేకపోవడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీని కారణంగా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఆస్తమా, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, కీళ్లనొప్పులు వంటి అనేక సమస్యల బారిన పడుతున్నారు. వీటన్నింటికీ యోగానే సరైన నివారిణి అని భావించిన చాలామంది ఉదయం, సాయంత్రం కొద్ది సమయాన్ని యోగా కోసం కేటాయిస్తూ ఆరోగ్యం పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. యోగా సాధన తరువాత శారీరక, మానసిక పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందని, పలు రుగ్మతల నుంచి విముక్తి పొందామని సాధకులు చెబుతున్నారు. భారతీయుల సొంతమైన యోగా అంతర్జాతీయంగా ఎంతో ప్రాచుర్యం పొందింది.

యోగాకు పాటించాల్సిన నియమాలు..

రాత్రి త్వరగా నిద్రపోయి తెల్లవారుజామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని యోగాసనాలు ప్రారంభించాలని అభ్యాసకులు చెబుతున్నారు. యోగా గురువులు తెలిపిన మేరకు స్నానం చేసి యోగా చేయాలి. స్నానం చేయకముందు చేస్తే, యోగా ముగించి కొంత విరామం తీసుకున్న తరువాతే స్నానం చేయాలి. ఆసనాలు పరగడుపున చేయాలి. అల్పాహారం తీసుకుంటే 3 గంటల సేపటి తరువాత చేయాలి. ఆసనాలు వేసేటప్పుడు వదులైన దుస్తులు ధరించాలి. గాలి, వెలుతురు సోకే ప్రాంతాల్లో, కిటికీలు, తలుపులు తెరచి ఉన్న గదులు, హాలులో సమతలంగా ఉన్నచోట యోగా చేయాలి. ఉదయం పూట సూర్యకిరణాలు పడేచోట యోగా చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. శుభ్రమైన తివాచీ, దుప్పటి, చాప వంటి వాటిపై కూర్చుని యోగా చేయాలి.

అంతఃపరిశుభ్రత అవసరం



శరీరానికి బాహ్య పరిశుభ్రత ఎంత అవసరమో అంతఃపరిశుభ్రత కూడా అంతే అవసరం. శరీరంలోని అవయవాలను పరిశుభ్రం చేయడం యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం ద్వారానే సాధ్యమవుతుంది. పాము కాటుకు భయపడని మనిషి దోమకాటుకు మరణిస్తున్నాడు. అంటే మనిషిలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గదలే దీనికి ప్రధాన కారణం. మనిషి జీవన ప్రమాణం తగ్గుతోంది. దీనికి కారణం జీవన విధానంలో లోపమే. వీటన్నిటికీ ఏకైక పరిష్కారం యోగా.

– పుల్లయ్య, యోగా గురువు

రుగ్మతల నుంచి విముక్తి



యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఎన్నో శారీరక, మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొంది వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవచ్చు. నిత్యం యోగాకు కొంత సమయం కేటాయించాలి. యోగా చేయడం వల్ల ఆరోగ్యం ఎంతో బాగుపడుతుంది. మానసికంగా దృఢంగా ఉంటాం.

– ఎల్లప్ప రెడ్డి, యోగా రిసోర్స్ పర్సన్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై శిక్షణ ఇస్తున్న జయంతి

పుత్తూరు: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని బ్రహ్మకుమారీస్ సభ్యులు జయంతి తెలిపారు. వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వయో బేధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని తెలిపారు. విద్యార్థులు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయంచడంతో పాటు చదువుపై ఏకాగ్రతను సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది



త్యాగరాజు నాయుడును సన్మానం చేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, టీచర్లు

గంగాధర నెల్లూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని గంగాధర నెల్లూరు మండల విద్యాశాఖ అధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దాసరపల్లిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన త్యాగరాజు నాయుడును ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీచర్ బాబు నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు



పాఠ్యపుస్తకాల స్టాక్ పరిశీలిస్తున్న డీఈఓ దేవరాజు

- విధి నిర్వహణలో సమయ పాలన తప్పనిసరి
- జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు

కార్వేటినగరం: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి డీఈఓ దేవరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం చేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ఆవాస ప్రాంతాల్లో గల బడి ఈడు పిల్లలను విధిగా గుర్తించి 6–16 ఏళ్లలోపు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలన్నారు. అదేవిధంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించి వారి విద్యాసామర్థ్యాలను మెరుగు పరిచి విద్యార్థుల ప్రగతికి దోహదం చేయాలని ఆదేశించారు. డ్రాపౌట్లు లేకుండా ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఇప్పటి నుంచే నాణ్యమైన బోధన అందించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్‌తో కలసి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల వివరాలతో పాటు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజగోపురం శిలాఫలకం తొలగింపు



ధర్మరాజుల ఆలయం వద్ద కనిపించని శిలాఫలకం

పుత్తూరు: పట్టణంలోని శ్రీధర్మరాజులస్వామి ఆలయం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్కే రోజా పేరిట ఉన్న రాజగోపురం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను కాంగ్రెస్ పార్టీ వారు కానీ, వైఎస్సార్‌సీపీ వారు కానీ ఎప్పుడైనా తొలగించారా? ఇప్పుడు మాత్రం ఎందుకు ఇలా జరుగుతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇకనైనా ఇలాంటి వాటికి స్వస్తి పలకాలని వైఎస్సార్‌సీపీ నేతలు హితవు పలికారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ హేమభూషణ్

పుత్తూరు: వాతావరణంలో తలెత్తిన మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా మెలగాలని పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ డాక్టర్ కె.హేమభూషణ్ సూచించారు. గురువారం పీహెచ్‌సీ వద్ద అంగన్‌వాడీ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై ప్రజలు డయేరియా, వైరల్ ఫీవర్స్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

- ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. మంచినీటిని కాచి వడబోసి తాగాలి
- దోమల బారిన పడకుండా దోమ తెరలను వినియోగించాలి
- ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పల్లో, కూలర్లలో, రోళ్లలో, రిఫ్రిజిరేటర్లలో, పాతటైర్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి
- అలాగే డయేరియా, జ్వరాల బారిన పడినపుడు సొంత వైద్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. ప్రత్యేకించి విరేచనాలు అయినప్పుడు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్ పోలీసులు



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న పోలీసులు

నాగలాపురం: దారిలో దొరికింది కదా అని సంబరపడి సెల్‌ఫోన్‌ను జేబులో వేసుకుని వెళ్లలేదు. ఆ ఫోన్ ఎవరిదో ప్రాథమిక విచారణలో తెలుసుకుని మరో గ్రామానికి వెళ్లి ఫోన్‌దారుడికి అప్పగించారు. శభాష్ పోలీసులు అనిపించుకున్నారు. వివరాలు..మండలంలోని బీరకుప్పం గ్రామానికి చెందిన నాగలాపురం హెడ్ కానిస్టేబుల్ ఇమ్మాన్యుయేల్, కానిస్టేబుల్ భూపతి విధుల నిమిత్తం బైకు మీద వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డుపై ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటం గుర్తించారు. ఎవరి ప్యాంటు జేబులో నుంచో పడిపోయి ఉంటుందని గ్రహించారు. పోలీసులు ఆ మొబైల్ తీసుకుని అందులో చివరిగా కాల్ చేసిన వారికి ఫోన్ చేశారు. ఆవలి వ్యక్తితో మాట్లాడారు. ఆ ఫోన్ ఎస్ఎస్ పురం గ్రామానికి చెందిన వంశీది అని తెలుసుకున్నారు. ఆ తర్వాత పోలీసులు సరాసరి ఆ గ్రామానికే వెళ్లారు. వంశీని ప్రశ్నించి మొబైల్‌ను అందజేశారు. మొబైల్ తిరిగి ఇచ్చిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.





వారంతా కూలి పని చేసుకుని పొట్టపోసుకునే వారు. రేణిగుంట వివేకానంద కాలనీ, సీజేవిడీ కాలనీల్లోని ఇంటి స్థలాలను 22 ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చారు. కుటుంబమంతా కూలి పనిచేస్తామని చెప్పి అప్పులు తెచ్చుకున్నారు. కొన్ని నెలల కిందట తలదాచుకునేందుకు చిన్న చిన్న ఇళ్లు నిర్మించుకున్నారు. ఉన్నట్టుండి గురువారం వంది మందికి పైగా పోలీసులు, కేంద్ర బలగాలు అక్కడ మోహరించాయి. వారివెంటే అధికారులూ ఉన్నారు. వాళ్లంతా ఎందుకొచ్చారా అని ఆ పేద జనం భయపడిపోయారు. అలా చూస్తుండగానే జేసీబీలు వచ్చాయి. పేద దళితులు తలదాచుకుంటున్న 65 ఇళ్లను కూల్చివేశాయి. గుండెలవిసేలా ఆ పేద జనం చేస్తున్న ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి. కానీ అక్కడున్న వారికెవరికీ చెవికెక్కలేదు. ఇంతకీ వాళ్లు చేసిన పాపమేంటి? వారిని ఆదుకునేదెవరు?

– రేణిగుంట





బీసీ రక్షణ చట్టం తక్షణమే ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఏ ప్రభుత్వం తక్షణమే బీసీల సంరక్షణ కోసం రక్షణ చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికీ బీసీల్లో అనేక కులాలు ఎదుగుదలకు నోచుకోలేదన్నారు. నూతన ప్రభుత్వం బీసీ ఉద్యోగులపై వివక్ష చూపడం దారుణమని, బీసీలను ఒక పార్టీకి ఆపాదిస్తూ వారిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం మంచిది కాదన్నారు. కక్ష సాధింపు చర్యలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి, హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, మంచి ఆహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ బీసీ విద్యార్థి సంఘం నేతలు షణ్ముగ పవన్‌కుమార్, భార్గవ్‌కుమార్, డాన్ ఎజ్రా, రామాంజి పాల్గొన్నారు.

విద్యార్థులు జాబ్ ప్రొవైడర్స్‌గా ఎదగాలి



జాతీయ సెమినార్‌కు హాజరైన వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: విద్యార్థులు జాబ్ ప్రొవైడర్స్‌గా ఎదగాలని ఈ విషయాన్ని ప్రధాని మోదీ సైతం యువతకు పిలుపునిచ్చారని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మహిళా వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన యాక్సిలరేటర్ ఇంక్యుబేషన్ ఆపర్చునిటీస్ ఎర్లీ స్టేజ్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో వర్సిటీలో ఇంక్యుబేటర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఇంక్యుబేటర్ సెంటర్లను వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. వర్సిటీలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థినులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగి, సమాజానికి ఉపయోగపడుతూ మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. వేలూరు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్ బాబు, ప్రొఫెసర్ వెంకటకృష్ణ, కంప్యూటర్ సైన్స్ హెడ్ ఉషారాణి, కె.చందన, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు

గిరిధర్‌రెడ్డి సేవలు ఎనలేనివి



గిరిధర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

పాలసముద్రం: జూనియర్ అసిస్టెంట్ గిరిధర్ రెడ్డి సేవలు ఎనలేనివని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో జూనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్‌మౌలా, రాష్ట్ర లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిధర్‌రెడ్డి విద్యాభివృద్ధికి చేసిన ఎనలేనివని కొనియాడారు. అనంతరం గిరిధర్‌రెడ్డి దంపతులను దుశ్శాలువలతో తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.